నత్తనడకన కొనుగోళ్లు!

- ధాన్యం అమ్మకానికి అష్టకష్టాలు
- తేమ, తాలు, తరుగు పేరుతో కొర్రీలు
- కేంద్రాల్లోనే రోజుల తరబడి నిరీక్షిస్తున్నామని రైతుల మండిపాటు
- పట్టించుకోని అధికారులు


దోమలో లారీల కొరతతో నిలిచిన కొనుగోళ్లు

దోమ : అష్టకష్టాలు పడి వరిధాన్యం పండిస్తే అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ పక్క వరుణ గండం, మరో పక్క కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో అన్నదాత తీవ్ర ఇబ్బందుకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రతి రైతు నుంచి తప్పనిసరిగా వడ్లు కొనాలని అధికారులను ఆదేశిస్తే సంబంధిత అధికారులకు మాత్రం పట్టడం లేదు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని లారీల కొరతతో సాకుతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిపోతుంది. రైతులు వర్షం పడితే ఎక్కడ తడిసి ముద్దవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. మరో పక్క పలువురు రైతులు ధాన్యాన్ని రోడ్లపై అరబెడుతుంటే వర్షానికి తడిసిముద్దవుతున్నా పరిస్థితులు నెలకొంటున్నాయి.

సమయమంతా వృథా..

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 14 కొనుగోలు సెంటర్లు ఉండగా, డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో 7 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 7 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఐదు నుంచి ఎనిమిది రోజుల సమయం పడుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేసిన అనంతరం లారీల్లో మిల్లులకు తరలించి తర్వాత బిల్లులు చేసే సమయంలో తాలు, తరుగు, తేమ శాతం పేరుతో రైతులను కోతలకు గురి చేస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న లారీల కొరత..

కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి లారీలు రాకపోవడం ఇబ్బందిగా మారింది. దీంతో ధాన్యం ఎక్కడికి అక్కడే నిలిచిపోయింది. బొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో లారీలు రాక రైతులు తీసుకువచ్చిన ధాన్యం సెంటర్లనే నిలిచిపోయాయి. మిల్లుల వద్ద లారీలు త్వరగా ఖాళీ కాకపోవడంతోనే లారీల కొరత


బొంపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న మహిళా రైతు

ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతున్నాయని సెంటర్ల నిర్వాహకులు అంటున్నారు. త్వరితగతిన కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

రెండు ఎకరాల్లో సాగు చేశా..



రెండెకరాల పొలంలో వరి సాగు చేస్తే 100 బస్తాల దిగుబడి వచ్చింది. అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే లారీలు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. సెంటర్‌కి వచ్చి మూడు రోజులు అవుతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. వర్షం వస్తే తడిసిపోయో ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మొగులయ్య, రైతు, లింగస్‌పల్లి

లారీల కొరతతో..



రైస్ మిల్లుల వద్ద స్టాక్ పెరిగిపోవడంతో లారీల్లోని ధాన్యం ఖాళీ కావడం లేదు. దీంతో లారీల కొరత ఏర్పడింది. ఒక్కో సెంటర్‌కు రోజుకు రెండు లారీలు రావల్సి ఉండగా, కేవలం ఒక్క లారీ మాత్రమే వస్తుంది. ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నాం. రైస్ మిల్లుల్లో లారీలు ఖాళీ అయినా వెంటనే పంపిస్తామని చెబుతున్నారు.

– ప్రభాకర్‌రావు, వ్యవసాయ అధికారి, దోమ

చర్యలు తీసుకుంటాం



రైతులు తీసుకువచ్చిన ధాన్యం తేమ, తరుగు, తాలు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి సెంటర్‌లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాలను ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేయాలి. ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే తనిఖీ నిర్వహిస్తున్నాం. రైతుల నుంచి ఏదైనా ఫిర్యాదు అందితే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: మండల పరిధిలోని బెన్నూరు, జుంటుపల్లి గ్రామాల్లో పిడుగుపడి మృతి చెందిన రైతు కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బెన్నూరులో రైతు గొల్ల వెంకప్ప, జుంటుపల్లిలో శ్రీనివాస్, లక్ష్మప్పలు పిడుగుపడి మృతి చెందడం తనను ఎంతో కలిచివేసిందన్నారు. రైతులు పొలాల వద్ద పనిచేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయమై ఇప్పటికే తాండూరు ఆర్డీఓ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు.

బీరప్పగుడి నిర్మాణానికి స్థలం కేటాయింపు


గుడిస్థలంలో పూజలు చేసిన గ్రామపెద్దలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరులో కురుమల ఆరాధ్యదైవంగా పూజించే బీరప్ప ఆలయ నిర్మాణానికి ఆదివారం స్థలం కేటాయించారు. అనంతరం కురుమ గ్రామపెద్దలు భూమికి పూజ చేశారు. శ్రావణమాసం అనంతరం ఆలయం పనులు ప్రారంభించనున్నట్లు మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు మహేందర్, మాజీ ఉపసర్పంచు శ్యామప్ప, కురుమ సంఘం అధ్యక్షుడు బాలప్ప, ఉపాధ్యక్షుడు పెద్దకుర్వ మహేందర్, గ్రామ పెద్దలు గుణశేఖర్, భీంరావ్, బాలప్ప, బాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్, చందు, చిన్నయ్య, లక్ష్మప్ప, కిషన్‌నాయక్, మల్లప్ప ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పూడూరు: క్రీడలతోనే సత్సంబంధాలు ఏర్పడతాయని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అనిల్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాకంచర్లలో మండలస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో తొమ్మిది జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. కంకల్ జట్టుకు మొదటి బహుమతి రూ.10000 వేల నగదు, తిర్మలాపూర్ జట్టుకు రూ.5000 వేలు మెమెంటోను ద్వితీయ బహుమతిని అందజేశారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గణేష్, చంటి, హరికృష్ణ, రాహుల్ , క్రీడాకారులు పాల్గొన్నారు.

కులగణన తరువాతే స్థానిక ఎన్నికలు

మాసయ్య ముదిరాజ్



కుల్కచర్ల: బీసీల కులగణనను నిర్వహించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ సెల్ నాయకులు మాసయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడం సరికాదన్నారు. కులగణన చేయని పక్షంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రజల అభీష్టం మేరకు బీసీ కులగణన జరపాలని కోరారు. కులగణన జరపకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలందరూ కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

22 నుంచి లక్ష్మీనర్సింహాస్వామి జాతర

పూడూరు: ఈ నెల 22 నుంచి పూడూరు మండల పరిధిలోని రాకంచర్ల యోగానందా లక్ష్మీనర్సింహాస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, ధ్వజారోహణం, 23న గురువారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి 10 గంటలకు రథోత్సవం, 24న రాత్రి 10 గంటలకు దిపోత్సవం, 25న శనివారం సహస్ర పుష్పార్చన, 26న ఆదివారం ఉదయం చక్ర తీర్థం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కల్యాణం చేయదలచిన భక్తులు ఆలయ పూజారులు భీమాచారి, నర్సింహాచారి, రఘురామాచారులను సంప్రదించాలన్నారు. భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

ఎంపీటీసీ విజయ

దోమ: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ విజయ అన్నారు. మండలంలోని ఐనాపూర్‌లోని నాల్గొవ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కల్గుతుంది. ఈ నేపథ్యంలో కాలనీవాసులు ఎంపీటీసీ దృష్టికి తీసుకురాగా.. ఆమె మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి మరో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఆదివారం మరో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సమస్యను పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

కార్యక్రమంలో లైన్‌మెన్ రమేశ్, తెరాస గ్రామ అధ్యక్షుడు రుక్మయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మాసయ్య, గ్రామస్తులు జాఫర్, ఆంజనేయులు, రమేశ్, నర్సింహులు, వెంకట్, సాయిలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించండి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు


మాట్లాడుతున్న ఆంజనేయులు

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపురం ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. చేవెళ్ల ఎంపీ సీటు కచ్చితంగా బీజేపీ గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు వడ్ల విజయ్, చిరంజీవి, సాయిరెడ్డి, బొప్పి శ్రీహరి, రాములు, నరేందర్, నర్సిములు, జర్నప్ప,పాండు, సూర్యకాంత్‌లు ఉన్నారు.

పోరాట యోధుడు సుందరయ్య

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

మొయినాబాద్: పేదల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా దళితుల పక్షాన నిలిచి పోరాటాలు చేశారన్నారు. విద్యార్థి, యువజన, రైతులు, మహిళలు, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని, సుందరయ్య సిద్ధాంతాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆయన ఆశయ సాధన కోసం ఎర్రజెండా నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, నాయకులు అశోక్, శ్రీనివాస్, వెంకటయ్య, అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీతా జ్ఞానమే త్రైత సిద్ధాంతం

ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా సభ్యుడు నాగ్యనాయక్

షాద్‌నగర్: మాధవుడు ప్రబోధించిన గీతా జ్ఞానమే త్రైత సిద్ధాంతమని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక మహబూబ్‌నగర్ కమిటీ జిల్లా సభ్యుడు నాగ్యనాయక్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ గ్రామాల్లో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ్యనాయక్ మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ, అను మూడు ఆత్మల గురించి తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. ఇదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు శ్రీనివాసులు, కిషోర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, తిరుపతయ్య, కృష్ణయ్య, బుచ్చిలింగం, సావిత్రమ్మ, ఉదయ్, కిరణ్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కల్యాణలక్ష్మి అమలుపై హర్షం

బొంరాస్‌పేట: కల్యాణలక్ష్మి పథకం అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర్వుల జారీపై మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని రేగడిమైలారంలో ఆపార్టీ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, నాయకులు వెంకట్‌రెడ్డి, చంద్రప్ప తదితరులు సీఎం చేసిన ప్రకటన పేద ప్రజల్లో ఆనందం నింపుతోందన్నారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేసేందుకు రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని అన్నారు. తాజాగా కల్యాణలక్ష్మి పథకంతో పేద కుటుంబానికి రూ.1లక్ష, తులం బంగారం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైనవారంతా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ పార్వతమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ గ్రూప్‌ల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. హైదరాబాద్‌లో రాజేంద్రనగర్‌లోని గిరిజన సంక్షేమ ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థినీలు గ్రేడ్ పాయింట్స్, నాలుగు ఫొటోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అడ్మిషన్లకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. 20వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీల కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేవెళ్లలో నూతన డిగ్రీ కళాశాల భవనంతో పాటు నైపుణ్యం గల అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీలో కోర్సుల కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంఘం భవన నిర్మాణానికి విరాళం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న విశ్వకర్మల సంఘం భవన నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ మోటె శ్రీశైలం రూ.20వేల విరాళం అందజేశాడు. గ్రామంలో ఆదివారం విశ్వకర్మల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీశైలం విరాళం అందజేశారు. గ్రామంలో దాతలు ముందుకు వచ్చి భవన నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నల్లోల చంద్రయ్య, గోదాసు నర్సింహ, శ్రీను, బేత జంగయ్య, సంగెం మల్లేశ్, రవి, మల్లేశ్, విశ్వకర్మల సంఘం నాయకులు ప్రకాష్‌చారి, శ్రీనువాస్‌చారి, రవి చారి, అంజయ్య చారి, బాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

దోమ: మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో సయ్యద్ మౌల మఖూమ్ హుస్సేన్ (ఉర్సు) 19వ ఉత్సవాలను గత రెండు రోజులుగా నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం హజ్రత్ ఖాద్రి ఖ్వాజా సయ్యద్ మౌల మఖ్దూమ్ హుస్సేన్‌కు చందన పూజ, గంధం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. సయ్యద్ మౌల మఖూమ్ హుస్సేన్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే బాధలు, కష్టాలు, సకల రోగాలు ప్రజలకు దూరం చేయాలని కోరున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయుఆరోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, రాంచంద్రారెడ్డి, బాబర్, గ్రామస్తులు, పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తాం

బీజేపీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్



బంట్వారం: చేవేళ్ల పార్లమెంటు గడ్డపై తప్పనిసరిగా కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ కోట్‌పల్లి మండలం గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రతీ గ్రామంలో సైలెంట్ ఓటింగ్ భారీగా నమోదైందన్నారు. అంచనాలకు మించి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తున్నాడన్నారు. ఎన్నికల రోజు ఎక్కడికి వెళ్లినా ప్రజలు, యువకులు బీజేపీకి పెద్ద ఎత్తున బ్రహ్మరథం పట్టి ఓటింగ్‌లో పాల్గొన్నారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ప్రజల్లో నమ్మకం కోల్పోయారని విమర్శించారు. దేశంలో నరేంద్రమోడి ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను అనతి కాలంలోనే ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రపంచ దేశాలు గర్వించే స్థాయిలో నరేంద్ర మోదీ పాలన కొనసాగుతుందన్నారు. ఆయోధ్యలో రామ మందిరం నిర్మించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. దేశ ప్రజల మద్దతు బీజేపీకే ఉందని గుర్తు చేశారు. చేవేళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును ఆపడం ఎవ్వరితరం కాదన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఏఎస్‌ఐ సూర్యనారాయణ

దోమ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా ప్రశాంత వాతావరణం నివసిస్తూ పోలీసులకు సహకరించాలని ఏఎస్ఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాలేపల్లి గ్రామంలో ఎస్ఐ ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామస్తులకు, వాహనదారులకు శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాలపై పోలీస్ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, వాహనాలకు సంబంధించి ధృవపత్రాలతో ప్రయాణాలు సాగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపించరాదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాస్, హీరాలాల్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

దోమ : దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1993–94 విద్య సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు గడిచినా తమను గుర్తుంచుకొని పిలిచి గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. నాడు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడం వల్లే తామందరం వివిధ ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడి జీవనాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులు రాంరెడ్డి, దాసును ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితుడు బోయిని కృష్ణ మరణించడంతో వారి కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పి తక్షణమే రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఇక ముందు ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన ఆదుకుంటామన్నారు. 50మంది సభ్యులతో కలిసి ఒక ట్రస్ట్‌గా ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. ప్రతి వ్యక్తి ఎదుగుదలలో గురువుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నాడు మా గురువులు చెప్పిన పాఠాలే మమ్మల్ని ఉన్నత స్థాయికి రావడానికి కారణమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ధారూరు: గురువులను సన్మానిస్తున్న దృశ్యం

కురిసిన చిరుజల్లులు


అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం ఆయా గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, ముర్తుజాగూడ, బాకారం, కనకమామిడి, తోల్‌కట్ట, ఎన్కెపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, నదీమ్‌నగర్, కాశీంబౌలి, చిన్నమంగళారం, టోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి, ఆయా గ్రామాల్లో సాయంత్రం వేళ చిరుజల్లులతో వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌదరిగూడ మండల పరిధిలోని రావిరాల గ్రామంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలన్నారు. భగవన్నామస్మరణతో ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, శేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ్యూల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సామ్యూల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్యూల్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి ఉన్నారు.